# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-4 20, ఏప్రిల్, 2015

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వాటర్ గ్రిడ్ నిర్మాణం పట్ల యావత్ దేశం ఆసక్తిగా ఉన్నదని, ప్రజలకు సురక్షిత నీరు అందించడంతోపాటు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే విధంగా ప్రాజెక్టును పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. పనులు వేగంగా, పారదర్శకంగా జరగాలని సూచించారు. ఇప్పటికే పలు సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయని, ప్రభుత్వం కూడా ఎంత ఖర్చయినా పెట్టడానికి సిద్ధంగా ఉందన్నారు. నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు, కరువు పీడిత మహబూబ్‌నగర్ జిల్లాకు మొదటగా మంచినీరు అందించి, ఆ తరువాత ప్రాజెక్టు పురోగతిని బట్టి మంచినీటి సరఫరా చేస్తూ పోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

సచివాలయంలో సోమవారం వాటర్ గ్రిడ్ పనులపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పంచాయతిరాజ్ శాఖ మంత్రి కె.తారకరామారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, సిఎంఓ ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగ్‌రావు, పంచాయతిరాజ్ శాఖ కార్యదర్శి రేమాండ్ పీటర్, ఆర్థిక శాఖ కార్యదర్శి ప్రదీప్‌చంద్ర, ప్రిన్సిపల్ చీఫ్ ఫారెస్టు కన్సర్వేటర్ మిశ్రా, వాటర్ గ్రిడ్ ఎండి శాలిని మిశ్రా, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఎన్‌సి సురేందర్‌రెడ్డి తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

హడ్కో, నాబార్డు నుండి ఇప్పటికే 13 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రావడానికి ఒప్పందాలు కుదిరాయని, ఈ సంస్థలే మరో 7 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. ఇతరత్రా కూడా నిధులు వస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం నుండి కూడా కొంత మేర నిధులు అందుతాయని ముఖ్యమంత్రి అన్నారు. ఎప్పుడు ఎక్కడ ఎంత అవసరం పడ్డా నిధులు సమకూర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, సవాలుగా తీసుకుని వాటర్ గ్రిడ్ నిర్మాణం చేపడుతున్నందున అధికార యంత్రాంగం కూడా అదే పట్టుదలతో పనిచేయాలని కోరారు. మొత్తం 26 ప్యాకేజీలలో 17 ప్యాకేజీలకు టెండర్లు కూడా పూర్తయ్యాయని, మరో వారం రోజుల్లో వంద శాతం టెండర్లు పూర్తి అవుతాయని మంత్రి కేటిఆర్ చెప్పారు. 15 రోజుల్లోగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని, దేశంలోని అన్ని ప్రముఖ సంస్థలు టెండర్లలో

పాల్గొనే విధంగా విస్తృత ప్రచారం కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. 26 ప్యాకేజీలను నాలుగు ఐదు భాగాలుగా విభజించుకుంటే పనులను సమీక్షించడం సులువుగా ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. పనులలో వేగం పెంచడంతో పాటు నాణ్యత విషయంలో కూడా రాజీ పడవద్దని ముఖ్యమంత్రి అన్నారు. సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్) రూపొందించిన తరువాత ఎక్స్‌పర్ట్ కమిటీకి కూడా పరిశీలనకోసం పంపి సూచనలు తీసుకోవాలని సిఎం సూచించారు. వివిధ స్థాయిల్లో పైపులైన్లకు 311 చోట్ల రైల్వే లైన్లు అడ్డు వస్తున్నాయని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. దీంతో సిఎం వెంటనే దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీవాత్సవతో మాట్లాడారు. పైపులైన్లు రైల్వే లైను క్రాస్ చేయడానికి అనుగుణంగా నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. రెండు మూడు రోజుల్లోనే రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఈ విషయంపై సమావేశం కానున్నారు. అన్ని క్రాసింగ్‌లకు బ్లాంకెట్ అనుమతి పొందాలని సిఎం చెప్పారు.

---

**సిపిఆర్ఓ టు సిఎం**